# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 సంచిక : 98 బుధవారం 11 జూన్ 2025 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988
vnteluguddaily@gmail.com




# సీనియర్లకు అంటే భయమా?

**తెలంగాణ కేబినెట్‌లో మొత్తం పద్దెనిమిది మంది మంత్రులకు అవకాశం ఉంటుంది వీరిలో పన్నెండు మంది మాత్రం ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఏడాదిన్నర కిందట ప్రమాణ స్వీకారం చేశారు.**

ఇప్పటి వరకూ హోం, హోంశాఖ వంటి ప్రధాన శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నాయి. పేరుకు ముఖ్యమంత్రి చూస్తారు కానీ ఆయనకు అంత తీరిక ఉండదు. మంత్రుల్లేని శాఖలన్నమాట. అలాంటి కీలకమైన శాఖలకూ మంత్రులు లేకపోవడం సీఎం విధి నిర్వహణలో సమస్యలు తెచ్చి పెడుతుంది. అందుకే పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం సీఎం వైఫల్యమేనంటున్నారు. పొరుగున ఉన్న కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉన్నా.. మొత్తం మంత్రి వర్గాన్ని సిద్ధరామయ్య ఏర్పాటు చేసుకున్నారని కొంత మంది గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం సమర్థంగా నడవాలంటే వ్యవస్థల్లో సమర్థులైన వారు ఉండాలి. ముఖ్యంగా మంత్రివర్గం పూర్తి స్థాయిలో ఉండటంతో పాటు వారంతా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాల్సి ఉంది. లేకపోతే పాలనపై ప్రభావం పడుతుంది. పూర్తి స్థాయి మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోకపోతే రాజకీయంగానూ విమర్శలు వస్తాయి.



## నమో యాప్‌లో 15 ప్రశ్నలతో జన్-మాన్ సర్వే




- వివిధ రంగాలకు సంబంధించిన ఈ ప్రశ్నలకు సమాధానాలను ఉపయోగించి, మోదీ ప్రభుత్వం ప్రజల పరీక్షను ఎంత బాగా ఎదుర్కొనిందో తెలుసుకుంటారు.
- ఆర్థిక వృద్ధి నుండి సామాజిక అభ్యున్నతి వరకు ప్రజల కేంద్రీకృత, సమ్మిళిత, సమగ్ర పురోగతిపై దృష్టి

## మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసింది



- "గత 11 ఏళ్లలో మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసింది
- దేశ భద్రత విషయంలో కేంద్రం వ్యవహార శైలి మారింది
- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఇది స్పష్టమైంది.
- కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## మళ్లీ కులగణన..



- అధిష్టానం ఆదేశాలతో కర్ణాటక సర్కార్ కీలక నిర్ణయం
- ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మంగళవారం సూచన ప్రాయంగా ప్రకటించారు.
- రాష్ట్రంలో మళ్లీ కులగణన చేపట్టాలని భావిస్తోంది.



## ప్రధాని మోదీకి ఖర్గే సంచలన లేఖ

- లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యమవుతుండటంపై లేఖ
- భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి
- స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దే

# విద్యుత్ ఉద్యోగులకు కోటి బీమా

- రాష్ట్రంలోని 50 వేల మంది విద్యుత్ ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం
- ఇన్సూరెన్స్ పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం
- ప్రజల కోసం పనిచేసే సంస్థల్లో విద్యుత్ సంస్థ కీలకం
- ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది కుటుంబాలు, వారి యోగ క్షేమాల గురించి ఆలోచించి ఈ ప్రమాద బీమా పథకం తీసుకొచ్చాం



హైదరాబాద్

విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని 50 వేల మంది విద్యుత్ ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. ఇన్సూరెన్స్ పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్లో విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా బ్యాంకర్లతో మంగళవారం ఒప్పందం అనంతరం సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే సంస్థల్లో విద్యుత్ సంస్థ కీలకం. ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది కుటుంబాలు, వారి యోగ క్షేమాల గురించి ఆలోచించి ఈ ప్రమాద - మిగతా3లో



## కాళేశ్వరం కమిషన్ ముందుకు

# కేసీఆర్

- ఇప్పటికే ఈ జ్యుడీషియల్ కమిషన్ ఎదుట ఇరిగేషన్ అధికారులు, మాజీ అధికారులు, మాజీ ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, మాజీ ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు హాజరు
- కమిషన్ ఏం ప్రశ్నలు వేస్తుంది?
- అందుకు కేసీఆర్ ఏం సమాధానాలు చెబుతారు?
- ఆ తర్వాత ఆయన మీడియా ముందు మాట్లాడతారా?
- ఒకవేళ మాట్లాడితే ఏం మాట్లాడతారు? అన్న ఉత్కంఠ

# నమో యాప్‌లో 15 ప్రశ్నలతో జన్-మాన్ సర్వే




**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలు, 140 కోట్ల మంది భారతీయుల ఆశీర్వాదాలు, సమిష్టి భాగస్వామ్యంతో భారతదేశం వివిధ రంగాలలో వేగవంతమైన మార్పులను చూసిందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సమిష్టి విజయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేయడంతో పాటు, ప్రజల మనస్సులలోని సుపరిపాలనను పరీక్షించాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు.నమో యాప్‌లో 15 ప్రశ్నలతో కూడిన జన్-మాన్ సర్వే ప్రారంభించారు. వివిధ రంగాలకు సంబంధించిన ఈ ప్రశ్నలకు సమాధానాలను ఉపయోగించి, మోదీ ప్రభుత్వం ప్రజల పరీక్షను ఎంత బాగా ఎదుర్కొనిందో తెలుసుకుంటారు. గత 11 సంవత్సరాలుగా జరిగిన సంక్షేమ, అభివృద్ధి పట్ల తన భావాలను, విశ్వాసాన్ని సోషల్ మీడియా చీ పై పోస్ట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన, పరివర్తనపై స్పష్టమైన దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే సూత్రాలతో మార్గనిర్దేశం చేసిన ఎన్డీఏ ప్రభుత్వం వేగం, స్థాయి , సున్నితత్వంతో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. ఆర్థిక వృద్ధి నుండి సామాజిక అభ్యున్నతి వరకు ప్రజల కేంద్రీకృత, సమ్మిళిత, సమగ్ర పురోగతిపై దృష్టి కేంద్రీకరించింది. నేడు, భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాదు, వర్తమాన పరిస్థితులు, డిజిటల్ ఆవిష్కరణ వంటి కీలక అంశాలపై ప్రపంచ స్వరంగా భారత్ మారింది. "సమిష్టి విజయం పట్ల గర్విస్తున్నాము. అదే సమయంలో, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే ఆశ, విశ్వాసం, కొత్త సంకల్పంతో మేము ముందుకు సాగుతున్నామని" ప్రధాని మోదీ పేర్కొన్నారు.ప్రభుత్వ పనితీరుని ప్రజలు ఎలా చూస్తున్నారనే దానిపై జన్ మాన్ సర్వే చేపట్టారు. ప్రధానమంత్రి నమో యాప్‌లో ప్రారంభించిన జన్-మాన్ సర్వే గురించి సమాచారాన్ని పంచుకున్నారు. గత 11 సంవత్సరాలలో అనేక సానుకూల మార్పులు జరిగాయని, జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహించామని రాశారు. ఈ సర్వేలో పాల్గొనాలని ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సర్వేలో వివిధ రంగాలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. ఉదాహరణకు, మొదటి ప్రశ్న ఉగ్రవాదంపై భారతదేశం కఠినమైన వైఖరికి సంబంధించినది.

**సర్వేలో అడిగిన ప్రశ్నలు**

1. గత దశాబ్దంలో ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారతదేశం విధానం ఏమిటి?
2. ఒక పౌరుడిగా, జాతీయ భద్రతా సవాళ్లకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం తీసుకుంటున్న కఠినమైన వైఖరితో మీరు ఎంత సురక్షితంగా భావిస్తున్నారు?
3. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ స్వరం ఇప్పుడు గతంలో కంటే ఎక్కువగా వినబడుతుందని, గౌరవించబడుతుందని మీరు నమ్ముతున్నారా?
4. గత సంవత్సరంలో మీరు ఏ డిజిటల్ ఇండియా ఉత్పత్తి లేదా సేవను ఎక్కువగా ఉపయోగించారు?
5. మహిళలపై దృష్టి సారించిన ప్రశ్న ఏమిటంటే, మహిళల నేతృత్వంలోని అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన సంస్కరణగా మీరు ఏమి చూస్తున్నారు?
6. యువతను అనుసంధానించడానికి, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా లేదా విద్యలో సంస్కరణలు యువతకు అవకాశాలను ఎంతవరకు పెంచాయి?
7. వ్యాపారవేత్తలకు ప్రశ్న ఏమిటంటే: మేక్ ఇన్ ఇండియా తయారీ రంగంపై ఎలాంటి ప్రభావం చూపిందని మీరు అనుకుంటున్నారు?
8. జాతీయవాదం, సంస్కృతి ద్వారా ప్రేరణ పొందిన వ్యక్తులకు ప్రశ్న ఏమిటంటే, మీరు ఎలా గర్వంగా భావిస్తున్నారు?
9. ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలపై స్థానిక, జాతీయ ప్రజా ప్రతినిధుల ఉనికి లేదా జవాబుదారీతనం గురించి మీ అంచనా ఏమిటి?

ప్రస్తుతం ప్రతిపక్షాలు భారతదేశ దౌత్యం గురించి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కాబట్టి ఈ సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నం జరిగింది. పురుషుల నుండి మహిళల వరకు వృద్ధుల వరకు, సుపరిపాలన నుండి వ్యాపారం వరకు ప్రతి వర్గం అభిప్రాయాలను సర్వేలో చేర్చారు. అభివృద్ధి చెందిన భారతదేశంలో మౌలిక సదుపాయాలు, ప్రజల భాగస్వామ్యం అనే ఆలోచన గురించి కూడా కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. సర్వేలో పాల్గొన్న వారికి ఆన్‌లైన్ సర్టిఫికెట్లు కూడా వెంటనే జారీ చేయడం జరుగుతుంది. తద్వారా సర్వేలో పాల్గొన్న వారి పూర్తి రికార్డు నిర్వహించడం జరుగుతుంది.సాధారణంగా, ఎన్నికల సమయంలో, ప్రభుత్వం లేదా పార్టీలు తమ ప్రజా ప్రతినిధుల అంతర్గత రిపోర్ట్ కార్డులను సిద్ధం చేస్తాయి. కానీ మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ ముఖ్యమైన దశలో, ప్రధాని మోదీ ప్రభుత్వంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేల రిపోర్ట్ కార్డును సిద్ధం చేయాలనుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకుంటుంటే, స్థానిక ప్రతినిధుల పట్ల ప్రజల వైఖరి ఎలా ఉందో ప్రధాని మోదీ చూడాలనుకుంటున్నారు. అందుకే సర్వేలో దీని కోసం ఒక ప్రశ్నను చేర్చారు.

# సింగిల్ డిజిట్‌కు భారత్ పేదరికం



**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్థాన్ మధ్య పేదరిక స్థాయిలలో గణనీయమైన వ్యత్యాసం ఉందని తాజాగా ప్రపంచ బ్యాంకు గ్లోబల్ పావర్టీ డేటా స్పష్టం చేసింది. వరల్డ్ బ్యాంకు డేటా రెండు దేశాల ఆర్థిక ప్రగతి, పాలన వ్యవస్థల ప్రభావం,సామాజిక సంక్షేమ విధానాల ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. భారతదేశంలో తీవ్రమైన పేదరిక రేటు2011లో 22.5%గా ఉండగా.. అది 2021 నాటికి 10%కి తగ్గింది.అంతేకాదు, 2024 నాటికి ఈ రేటు సింగిల్ డిజిట్‌కు తగ్గిపోవచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ఆహార రాయితీలు వంటి సంక్షేమ పథకాలు ఈ పురోగతికి దోహదం చేశాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, డిజిటల్ లావాదేవీల విస్తరణ కూడా పేదరికం తగ్గుదలకు దోహదం చేశాయని తెలిపింది. జనాభాలో ఎంత శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువ నివసిస్తున్నారో నిర్ధారించడానికి ద్రవ్యోల్బణాన్ని దాని ప్రాథమిక సూచికలలో ఒకటిగా వరల్డ్ బ్యాంకుపరిగణనలోకి తీసుకుంది. తన ప్రపంచ ఆదాయ పరిమితిని ఓ వ్యక్తికి రోజుకు 2.15డాలర్ల నుంచి 3 డాలర్లకు సవరించింది. ప్రపంచ బ్యాంకు పేదరికం, భాగస్వామ్య శ్రేయస్సు నివేదిక ప్రకారం.. 2012- 2022 మధ్య, ప్రతి వ్యక్తి ఆదాయంలో పెరుగుదల సవరణ ఉన్నప్పటికీ, భారతదేశంలో తీవ్ర పేదరికం మొత్తం జనాభాలో 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గింది.భారత్‌లో 2022-23 నాటికి 75.24 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారని, ఇది 2011-12లో 344.47 మిలియన్లతో పోల్చితే భారీ తగ్గుదల అని నివేదిక పేర్కొంది. కేవలం 11 ఏళ్లలో పాకిస్థాన్ మొత్తం జనాభా కంటే ఎక్కువ మంది భారతదేశంలో తీవ్ర పేదరికం నుంచి బయటపడటం విశేషం.విచారకరంగా పాకిస్థాన్ విషయానికొస్తే కథ దీనికి విరుద్ధంగా ఉంది. 2017- 2021 మధ్య 5 ఏళ్లలో తీవ్ర పేదరికం 4.9 శాతం నుంచి 16.5 శాతానికి పెరిగింది. పాక్ గృహ ఆదాయం, వ్యయ సర్వే కారణంగా పరిస్థితి చాలా దారుణంగా ఉండొచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.పాకిస్థాన్‌లో ఆర్థిక సంక్షోభం, పేదరికం మరింత తీవ్రమవుతుండటం గమనార్హం. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌లో పేదరిక రేటు 2018లో 34.2%గా ఉండగా.. 2023 నాటికి అది 39.4%కి పెరిగింది. గత ఐదేళ్లుగా పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం, ఐఎంఎఫ్ రుణాలపై ఆధారపడటం, ఆ దేశ కరెన్సీ విలువ పతనం, పాలనా అస్థిరత ప్రధాన కారణాలు. ముఖ్యంగా నిత్యావసర, ఇంధన ధరల పెరుగుదల, ఉద్యోగ అవకాశాల కొరత దాయాది దేశంలో పేదరికాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. ఆయుధ సామాగ్రి వ్యయాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు నిధుల వినియోగం, సామాజిక పథకాలకు తక్కువ కేటాయింపులు ఇవన్నీ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయని నివేదిక తెలిపింది.వాస్తవంగా చూస్తే, వేగంగా పేదరికాన్ని తగ్గిస్తోన్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. మరోవైపు, పాకిస్థాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కోల్పోయి, అంతర్గత రాజకీయ అస్థిరత వల్ల సామాజిక రంగాల్లో వెనుకడుగు వేస్తోంది.ప్రస్తుతం పాక్ పేదరికం నుంచి బయటపడాలంటే రాజకీయ స్థిరత్వం,ప్రజాపాలనలో పారదర్శకత, వ్యవస్థాపిత సంక్షేమ విధానాలు, విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత పెట్టుబడి అవసరమని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేసింది.

# రాణా గుట్టు విప్పేస్తాడా...

**ముంబై :** 2008 ముంబై దాడులతో సంబంధం ఉన్న ఈ కేసులో రాణా ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడుతు న్నా డు. అతను ఇప్పుడు అమెరికాలో అదుపులో ఉన్నాడు. అతని నుంచి రాబోయే సమాచారం ఎన్నో రహస్యాలను వెలికితీసే అవకాశం ఉంది.తహవ్వుర్ రాణా, ఒక కీలక వ్యక్తిగా అంతర్జాతీయ ఉగ్రవాద కేసులలో తన పేరును నమోదు చేసుకున్న వ్యక్తి. 2008 ముంబై దాడులతో సంబంధం ఉన్న ఈ కేసులో రాణా ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడు తున్నాడు. అతను ఇప్పుడు అమెరికాలో అదుపులో ఉన్నాడు. అతని నుంచి రాబోయే సమాచారం ఎన్నో రహస్యాలను వెలికితీసే అవకాశం ఉంది.తహవ్వుర్ హుస్సేన్ రాణా, ఒక కెనడియన్ వ్యాపారవేత్త, ముంబై దాడులకు సంబంధించిన ఆరోపణలలో ప్రధాన వ్యక్తిగా చర్చించబడుతున్నాడు. అతను డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో కలిసి లష్కర్?ఏ?తోయిబాకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. రాణా తన ఇమ్మిగ్రేషన్ సంస్థ ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు సహాయం అందించినట్లు అమెరికా అధికారులు భావిస్తున్నా రు. 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడులు ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ దాడులలో రాణా ఒక ముఖ్యమైన మధ్యవర్తిగా పనిచేసినట్లు ఆధారాలు సూచిస్తున్నా యి. హెడ్లీతో కలిసి, రాణా దాడులకు సంబంధించిన ప్రణాళికలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను హెడ్లీకి ఆర్థిక మరియు లాజిస్టిక్ సహాయం అందించినట్లు నివేదికలు తెలిపాయి.రాణా 2009లో అమెరికాలో అరెస్టయ్యాడు. అతనిపై ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలు నమోదయ్యాయి. అతని విచారణ ప్రక్రియలో అనేక మలుపులు తిరిగాయి. రాణా విచారణలో సహకరిస్తే, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌ల గురించి కీలక సమాచారం బయటకు రావచ్చు. లష్కర్?ఏ?తోయిబా, ఇతర ఉగ్రవాద సంస్థలతో అతని సంబంధాలు, మరియు వారి ఆర్థిక వనరుల గురించి సమాచారం అందించే అవకాశం ఉంది. . అయితే, రాణా సహకరిస్తాడా లేదా అనేది ఇంకా అనిశ్చితంగా ఉంది.తహవ్వుర్ రాణా కేసు అంతర్జాతీయ ఉగ్రవాద యుద్ధంలో ఒక కీలక అధ్యాయం. అతను బయటపెట్టగల సమాచారం ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంలో సహాయపడవచ్చు. రాణా కేసు పురోగతిని ప్రపంచవ్యాప్తంగా భద్రతా నిపుణులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ కేసు భవిష్యత్తులో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

## మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసింది

**దేహ్రాదూన్:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 11 ఏళ్ల పాలనలో దేశ భద్రతను మరింత బలోపేతం చేశామని అన్నారు. దేహ్రాదూన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ "గత 11 ఏళ్లలో మోదీ సర్కారు దేశ భద్రతను బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసింది. దేశ భద్రత విషయంలో కేంద్రం వ్యవహార శైలి మారింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఇది స్పష్టమైంది. భారత చరిత్రలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తీసుకున్న అతి పెద్ద చర్య. దీన్ని ప్రపంచమంతా చూసింది. " అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

## గవర్నర్‌ను ఆర్సీబీ విజయోత్సవాలకు ముఖ్యమంత్రే ఆహ్వానించారు: రాజ్‌భవన్

కాగా.. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" బాధ్యత ప్రకటించుకుంది.

## మళ్లీ కులగణన..



**బెంగళూరు:** కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మళ్లీ కులగణన చేపట్టాలని భావిస్తోంది. అధిష్టానం ఆదేశాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మంగళవారం సూచన ప్రాయంగా ప్రకటించారు. అయితే కుల గణన అంశంపై సమీక్ష జరిపేందుకు ఎల్లుండి (జూన్ 12న) కర్ణాటక కేబినెట్ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇదిలా ఉంటే. . కర్ణాటకలో 2015లోనే అప్పటి ప్రభుత్వం కుల గణన జరిపింది. హెచ్ కాంతారాజ్ నేతృత్వంలో కర్ణాటక రాష్ట్ర బీసీ కమిషన్ ఈ సర్వేను నిర్వహించింది. ఆ సమయంలో కోటి 35 లక్షల ఇళ్లను సర్వే చేశారు. 51 ప్రమాణాల ఆధారంగా 5.98 కోట్ల మంది డాటాను సేకరించారు. అయితే.. రాజకీయపరమైన కారణాలు, ఇతర కారణాల దృష్ట్యా ఆ నివేదికను సీల్డ్ కవర్‌లోనే ఉంచారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కేబినెట్ ముందుకు ఆ నివేదిక వచ్చింది. అప్పటి నుంచి దఫ దఫాలుగా కేబినెట్ భేటీ అవుతూ.. కర్ణాటక సోషియో ఎకనమిక్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేపై చర్చలు జరుపుతోంది. అయితే ఆ నివేదికలోని ఓబీసీ రిజర్వేషన్లను 51 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అదేసమయంలో లింగాయత్, వక్కలింగ కులాలు ఈ నివేదికను తోసిపుచ్చుతున్నాయి. మరోవైపు .. మళ్లీ కుల గణన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఇటు రాజకీయ వర్గాలు, అటు మేధో వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా టీచర్లను సర్వేలో భాగం చేయడం వల్ల అకడమిక్ ఇయర్‌కు విఘాతం కలిగే అవకాశం ఉందని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జన గణనతో పాటే కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం మరోసారి కుల గణన జరపాలని అనుకుంటుండడం విశేషం. కేబినెట్ సబ్‌కమిటీ లేదంటే లెజిస్లేటివ్ కమిటీ ద్వారా కుల గణన సర్వేపై తుది నిర్ణయం తీసుకోవాలని కర్ణాటక ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే సంచలన లేఖ



ఢిల్లీ: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం లేఖ రాశారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీపై ప్రధానికి లేఖ రాశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యమవుతుండటంపై లేఖలో ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి అని తెలిపారు మల్లికార్జున ఖర్గే. స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దేనని మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు. ప్రతి కొత్త లోక్‌సభ రెండో లేక మూడో సెషన్‌లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం సంప్రదాయమని ఉద్ఘాటించారు. మొదటి నుంచి పదహారో లోక్‌సభ వరకు అన్ని లోక్‌సభల్లో డిప్యూటీ స్పీకర్ ఉన్నారని వివరించారు. కానీ 17వ, 18వ లోక్‌సభల్లో ఆ పదవి ఖాళీగా ఉందని చెప్పుకొచ్చారు మల్లికార్జున ఖర్గే. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం సంప్రదాయమని చెప్పారు. ఈ స్థానం ఖాళీగా ఉండటం రాజ్యాంగ ఉల్లంఘన అని తెలిపారు. వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించాలంటూ ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు.

## ఎన్సీపీ ముక్కలవుతుందని అసలు ఊహించలేదు: శరద్ పవార్

**పుణె:** నేషనల్ కాంగ్రెస్ పార్టీ ముక్కలవుతుందని కలలోనైనా ఊహించలేదని ఆ పార్టీ సహవ్యవస్థాపకుడు, ప్రస్తుత ఎన్సీపీ (ఎస్పీ)అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. పార్టీ చీలిపోయినా సవాళ్లను ఎదుర్కొని కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లిన నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. ఎన్సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభం నుంచి పార్టీ ఎన్నో సవాళ్లను, ఒడిదొడుకులను ఎదుర్కొందని చెప్పారు. అయినప్పటికీ నిరుత్సాహపడకుం డా పార్టీని ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. " పార్టీ ముక్కలవుతుందని అసలు ఊహించలేదు. కానీ, కొద్ది మంది వ్యక్తుల భావజాలాలు పార్టీని విడగొట్టాయి. దాని గురించి పెద్దగా మాట్లాడదలచుకోలేదు. పార్టీ సిద్ధాంతాలను నమ్మినవారే అందులో కొనసాగగలరు. రానున్న ఎన్నికల్లో సరికొత్త ములుపులు చూస్తారు. పార్టీలో ఎవరు చేరుతున్నారు? ఎవరు వెళ్లిపోతున్నారు? తదితర విషయాలేవీ పట్టించుకోవద్దు. మనమంతా కలిసికట్టుగా ప్రజలను ఏకం చేయగలిగితే ఎలాంటి సమస్యలు దరిచేరవు. ప్రజలకు సేవ చేయాలని చాలా మంది నాయకులు కృతనిశ్చయంతో ఉన్నారు. వాళ్లే పార్టీకి బలం, బలగం. అధికారం గురించి ఆలోచించొద్దు. మనమంతా కలిసి ఉంటే.. అది మనల్ని ఫాలో అవుతుంది" అని పవార్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు.

# కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్

**హైదరాబాద్ :** జూన్ 11, 2025 (బుధవారం) కాళేశ్వరం కమిషన్ ఎదుట తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) హాజరుకానున్నారు. ఇప్పటికే ఈ జ్యుడీషియల్ కమిషన్ ఎదుట ఇరిగేషన్ అధికారులు, మాజీ అధికారులు, మాజీ ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, మాజీ ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. ఇప్పుడు మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. కమిషన్ ఏం ప్రశ్నలు వేస్తుంది? అందుకు కేసీఆర్ ఏం సమాధానాలు చెబుతారు? ఆ తర్వాత ఆయన మీడియా ముందు మాట్లాడతారా? ఒకవేళ మాట్లాడితే ఏం మాట్లాడతారు? అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, రూపకల్పన, నిర్మాణం, నాణ్యతా లోపాలు, నిర్మాణ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, వాటి వెనుక దాగి ఉన్న అక్రమాలు వంటి విషయాలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్‌కు భారతదేశపు మొట్టమొదటి లోక్‌పాల్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన పినాకి చంద్ర ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ కమిషన్ ఇప్పటికే వంద మందికిపైగా కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన ఇంజనీర్లు, రిటైర్ అయిన మాజీ ఇంజనీర్లు, ఆర్థిక శాఖ అధికారులను, కాగ్ (అండ) అధికారులతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో పరోక్షంగా, ప్రత్యక్షంగా సంబంధం ఉన్న అధికారులను విచారించింది. ఆ తర్వాత మాజీ ఆర్థికమంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను జూన్ 6, 2025న కమిషన్ విచారణ జరిపింది. జూన్ 9, 2025న మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్ రావును విచారణ జరిపింది. ఇక ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జూన్ 11, 2025న విచారణకు రావాలని నోటీసులు పంపింది. అయితే, తొలుత కేసీఆర్‌ను జూన్ 5వ తేదీన హాజరు కావాలని నోటీసులు పంపగా, కేసీఆర్ విజ్ఞప్తి చేయగా జూన్ 11వ తేదీకి విచారణను వాయిదా వేసింది. అధికారులను విచారణ జరిపిన సమయంలో, కాళేశ్వరం ప్రాజెక్టు కీలక నిర్ణయాలన్నీ నాటి సీఎం కేసీఆర్ వద్దే జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే తాము పని చేశామని చెప్పడంతో కమిషన్ కేసీఆర్‌ను విచారణ జరపాలని నిర్ణయించి, ఆ మేరకు నోటీసులు జారీ చేసింది. ప్రపంచంలో అరుదైన ఇంజనీరింగ్ అద్భుతమని బీఆర్ఎస్ ప్రచారం చేయగా, 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రచారం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మి



బ్యారేజీ (మేడిగడ్డ)లోని ఏడో బ్లాక్‌లోని 16 నుంచి 21 పిల్లర్లు కుంగిపోయాయి. దీంతో బ్యారేజీలోని కొంత భాగం దెబ్బతిని, నీరు లీక్ అయ్యింది. దీనిపై విచారణ జరిపిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో కూడా లోపాలు ఉన్నాయని చెప్పింది. మేడిగడ్డ బ్యారేజీలో ఉన్న డిజైన్, నిర్మాణ లోపాలు అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీలలో కూడా ఉన్నట్లు ఎన్డీఎస్ఏ గుర్తించింది. ఈ బ్యారేజీలలో కూడా "డిస్ట్రెస్ కండిషన్స్" (నష్టం సూచనలు), లీకేజీలు కనిపించాయని పేర్కొంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద మానవ నిర్మిత విపత్తు అని ప్రకటన చేసింది. దీనిపై జ్యుడీషియల్ కమిషన్ ద్వారా విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అయితే, దీనిపై బీఆర్ఎస్ నేతలు ఎదురు దాడికి దిగారు. కాళేశ్వరం తెలంగాణకు జీవనాడి అని, తమ పార్టీని అప్రతిష్ట పాలు చేసే కుట్రగా మాజీ మంత్రి హరీశ్ రావు కమిషన్ ఎదుట హాజరైన అనంతరం వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, కేసీఆర్‌ను అప్రతిష్ట పాలు చేసే కుట్రగా అభివర్ణించారు. భాక్రానంగల్, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులను దశాబ్దాలుగా పూర్తి చేయలేకపోయిన కాంగ్రెస్ పార్టీ, అతి తక్కువ కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారన్న దుగ్ధతో ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇలా కాళేశ్వరం ప్రాజెక్టు రెండు పార్టీల మధ్య రాజకీయ యుద్ధానికి తెర లేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుట ఏం మాట్లాడతారు? ఆ తర్వాత మీడియాతో మాట్లాడతారా? ఏం మాట్లడాతారు? అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చాలా హోం వర్క్ చేశారు. పలు సార్లు కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఇంజనీర్లు, నీటి పారుదల రంగ నిపుణులు, మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్ రావుతో సమావేశమై చర్చించారు. నాడు ప్రాజెక్టు ప్రణాళిక దశ నుంచి పూర్తయ్యే వరకు తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకున్నారు. రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలన్న అంశంపైన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోను, హరీశ్ రావుతోను చర్చించారు. ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ చేసిన విచారణ అంశాలు, ఇప్పటివరకు జరిగిన పరిణామాల వివరాలు, కమిషన్ ఎదుట హాజరయినప్పుడు హరీశ్ రావును సంధించిన ప్రశ్నలు– వాటి సమాధానాలపైన చర్చ జరిగినట్లు సమాచారం. విచారణకు హాజరయ్యే ముందు అంటే బుధవారం మరో దఫా తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో చర్చించిన తర్వాత బీఆర్‌కే భవన్‌లోని కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు.

# సీనియర్లకు అంటే భయమా?

**హైదరాబాద్ :** ప్రభుత్వం సమర్థంగా నడవాలంటే వ్యవస్థల్లో సమర్థులైన వారు ఉండాలి. ముఖ్యంగా మంత్రివర్గం పూర్తి స్థాయిలో ఉండటంతో పాటు వారంతా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాల్సి ఉంది. లేకపోతే పాలనపై ప్రభావం పడుతుంది. పూర్తి స్థాయి మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోకపోతే రాజకీయంగానూ విమర్శలు వస్తాయి. ముఖ్యమంత్రిగా పట్టు లేదని.. అందుకే మంత్రి పదవుల్నీ ఇవ్వలేకపోతున్నారని అంటారు. ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎదురవుతోంది. తెలంగాణ కేబినెట్‌లో మొత్తం పద్దెనిమిది మంది మంత్రులకు అవకాశం ఉంటుంది. వీరిలో పన్నెండు మంది మాత్రం ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఏడాదిన్నర కిందట ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఆరు స్థానాలను ఖాళీగా ఉంచారు. వాటిని చూపించి ఎంపీ ఎన్నికల్లో ఆశావహుల్ని పరుగులు పెట్టించాలని అనుకున్నారు. అనుకున్నట్లుగా పెట్టించారు. కానీ ఫలితం ఎనిమిది సీట్ల వద్దనే ఆగిపోయింది. ఈ ఎఫెక్ట్ తో పాటు.. మంత్రి పదవుల రేసు తీవ్రంగా ఉండటంతో ఇప్పటి వరకూ భర్తీ చేయలేకపోయారు. రెడ్డి సామాజికవర్గంలో పోటీ ఊహించనంతగా ఉంది. ఎవరికి ఇచ్చినా మరొకరు తిరుగుబాటు చేస్తారన్న భయంతో మూడు పదవుల్ని ఖాళీగా ఉంచి మూడింటిని మాత్రమే భర్తీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సీఎం ప్రధాన విధి. అ?యతే ఇప్పటి వరకూ హోం, హోంశాఖ వంటి ప్రధాన శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నాయి. పేరుకు ముఖ్యమంత్రి చూస్తారు కానీ ఆయనకు అంత తీరిక ఉండదు. మంత్రుల్లేని శాఖలన్నమాట. అలాంటి కీలకమైన శాఖలకూ మంత్రులు లేకపోవడం సీఎం విధి నిర్వహణలో సమస్యలు తెచ్చి పెడుతుంది. అందుకే పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం సీఎం వైఫల్యమేనంటున్నారు. పొరుగున ఉన్న కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉన్నా.. మొత్తం మంత్రి వర్గాన్ని సిద్ధరామయ్య ఏర్పాటు చేసుకున్నారని కొంత మంది గుర్తు చేస్తున్నారు. మంత్రి పదవుల కోసం పోటీ అనేది సహజంగానే ఉంటుంది. కేబినెట్ మంత్రులపై కసరత్తు జరిగినప్పుడు కేవలం ఒక్కటి మాత్రమే ఖాళీగా ఉంచి ఐదు పదవుల్ని భర్తీ చేయాలనుకున్నారని.. వివాదాస్పదమైన ఒకరిద్దరు మంత్రుల్ని తప్పించి.. కొత్త వారికి చాన్సివ్వాలనుకున్నారన్న ప్రచారం జరిగింది. కానీ అలాంటి పరిస్థితులు కనిపించలేదు. తీవ్రంగా మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్న వారికి చాన్స్ దక్కలేదు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాల్లో కొన్ని జిల్లాలకు మూడు పదవులు దక్కాయి కానీ.. గ్రేటర్, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు ఒక్క పదవి కూడా లేదు. ఇలా సమీకరణాలను చూసుకోలేకపోవడం.. పూర్తి స్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం రేవంత్ రెడ్డికి సమస్యగా మారింది. ఆయన పాలనపై , పార్టీపై, ప్రభుత్వంప పట్టు సాధించలేదనడానికి నిదర్శనమని అంటున్నారు.

### కలిసొచ్చిన సామాజిక వర్గాలు

తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిని తెలంగాణ మంత్రి పదవులు వరించాయి. సామాజిక సమీకరణాలు, ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇలా అనే విషయాలు పరిశీలించిన కాంగ్రెస్ అధిష్టానం కొత్తగా ముగ్గురికి తెలంగాణ క్యాబినెట్లో చోటు కల్పించింది. తాజాగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే అయి.. తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర మంత్రి అయ్యారు. తెలంగాణలో 119 నియోజకవర్గాలు, ఒక గవర్నర్ నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేతో కలిపి 120 స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర కేబినెట్ లో మొత్తం 18 మందికి చోటు కల్పించవచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. తాజాగా కేబినెట్ విస్తరణలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరిని మంత్రి పదవి వరించింది. బీసీల్లో మొత్తం 7 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, అత్యధిక జనాభా, ప్రాబల్యం ఉన్న సామాజికవర్గం కావడంలో ముదిరాజ్ ముద్దుబిడ్డ వాకిటి శ్రీహరి తెలంగాణ కేబినెట్ బెర్త్

### ఆందోళనలకు దిగుతున్న సీనియర్లు

భోధన్ శాసనసభ్యుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మిన బంటుగా ఉన్నారు. సుదర్శన్ రెడ్డిని మంత్రిని చేయడానికి రేవంత్ రెడ్డి అనేక సందర్భాలలో హస్తిన వెళ్లిపోయారు. గట్టిగా సిఫారసు కూడా చేశారు. అయినప్పటికీ అధిష్టానం రేవంత్ రెడ్డి మాట పట్టించుకోనట్టు తెలుస్తోంది. సుదర్శన్ రెడ్డిని పక్కనపెట్టి.. సామాజిక సమతూకంతో బీసీ, ఎస్సీ లకు మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించి.. దానిని అమలులో పెట్టినట్టు తెలుస్తోంది. వాస్తవంగా ఈ పరిణామం సుదర్శన్ రెడ్డి ఇలాంటి వారికి మింగుడు పడడం లేదని ఆయన వర్గీయులు అంటున్నారు. అందువల్లే మంగళవారం బోధన్ బందుకు వారు పిలుపునిచ్చారు. అయితే ఈ బంద్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది చూడాలి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి అనేక సందర్భాలలో మంత్రి పదవులు ఆశించి భంగపడిన సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి వారితో చర్చలు జరిపారు. భవిష్యత్తులో జరిగే విస్తరణలో ప్రాధాన్యం కల్పిస్తామని మాట ఇచ్చారు. ఆ సమయంలో వారు మీనాక్షి మాట విన్నప్పటికీ.. ఆ తర్వాత మళ్లీ అలకపాన్పు ఎక్కారు. ఇక మల్ రెడ్డి మంత్రి పదవి రాకపోవడంతో కీలక వ్యాఖ్యలు చేశారు.. క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టు తగ్గిపోతోందని.. వాస్తవంగా ఏం జరుగుతుందో తెలుసుకునే బాధ్యతను అధిష్టానం చేయలేకపోతుందని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఒక రకంగా రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టిస్తున్నాయి.. అయితే ఆయన వేరే దారి చూసుకుంటారా? లేక మలి దశ విస్తరణలో మంత్రి పదవి దక్కించుకుంటారా అనేది చూడాల్సి ఉంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా అధిష్టానం పై ఆగ్రహంగా ఉన్నారు. మంత్రి పదవి వస్తుందని ఆయన గట్టి నమ్మకంతో ఉన్నారు. ఢిల్లీ పెద్దలతో కూడా సంప్రదింపులు జరిపారు. శుభవార్త వస్తుంది అనుకుంటున్న తరుణంలో ఊహించని విధంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో అధిష్టానం పై ఆయన ఒక రకమైన అసంతృప్తి భావనతో ఉన్నారు. తనను అధిష్టానం మంత్రి పదవికి పరిగణలోకి తీసుకోకపోవడం పట్ల తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక మంత్రి పదవులు లభించిన వారు మాత్రం ఆనందంగా ఉన్నారు. తమ అనుచరులతో సంబరాలు జరుపుకుంటున్నారు.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.. ఇప్పటికే ఓ కీలక నాయకుడు ఢిల్లీ వెళ్ళిపోయారు.

# మరో 20 రోజులు రేషన్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ సరుకుల పంపిణీ సమయాన్ని ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి తెలంగాణలో రేషన్ దుకాణాలలో ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒకేసారిమూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని అందించాలని నిర్ణయం తీసుకుంది. రానున్న మూడు నెలలు ప్రకృతి వైపరీత్యాలు వచ్చే అవకాశమున్నందున మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో ఒక్కొక్క రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుడికి పద్దెనిమిది కేజీల బియ్యాన్ని అందిస్తుంది. కుటుంబంలో ఎంత మంది ఉన్నప్పటికీ అన్నిపద్దెనిమిది కేజీల బియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఒకేసారి రేషన్ బియ్యం ఇస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూ లైన్ లతో పడిగాపులు పడుతున్నారు. అనేక మంది జాగారం చేయాల్సి వస్తుంది. తీరా తమ వంతుకు వచ్చేసరికి స్టాక్ అయిపోతుండటంతో నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే ఈ నెల 30వ తేదీ వరకూ రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని, అందరికి పంపిణీ చేయడానికి సరిపడా స్టాక్ రేషన్ దుకాణాల వద్ద ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రేషన్ కార్డులున్న వారందరికీ మూడు నెలలకు సరిపడా సన్న బియ్యాన్ని అందచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. హరీశ్ రావు గడువు పెంచడంతో... రేషన్ సరుకులను ఇచ్చే గడువును పెంచిన కారణంగా కొంత రద్దీ తగ్గుతుందని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డులు వస్తే మరో ముప్ఫయి లక్షల మంది లబ్దిదారులు పెరిగే అవకాశముంటున్నారు. ఈ సన్నబియ్యం పథకం కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 10,615 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. రద్దీని తగ్గించేందుకు, అందరికీ రేషన్ బియ్యం అందేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## విద్యుత్ ఉద్యోగులకు కోటి భీమా

-మొదటిపేజీ తరువాయి

బీమా పథకం తీసుకొచ్చాం. ఈ నిర్ణయం వ్యక్తిగతంగా నాకు బాగా తృప్తిని ఇచ్చింది. విద్యుత్ శాఖ లో పనిచేసే ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ ప్రాణాలు అడ్డంపెట్టి విధుల్లో పాల్గొంటారు. అందుకే వారి కుటుంబాల యోగక్షేమాల కోసం ఈ ప్రమాద బీమా పథకాన్నితీసుకువచ్చాం. రాష్ట్ర జిడిపి పెరుగుదలకు ఇందనంగా ఉపయోగపడే ప్రధాన శాఖ విద్యుత్ శాఖ. లైన్ మెన్ మొదలు సీఎండీ స్థాయి వరకు పనిచేసే ఉద్యోగులకు ఇతర శాఖల ఉద్యోగుల తరహాలోనే కుటుంబాలు ఉంటాయి. వారి హోదాలు వేరైనా కుటుంబం విషయం వచ్చేసరికి వారికి అనుబంధం, బాధ్యత ఉంటుందన్నారు. అనుకోని ప్రమాదం జరిగి ఇంటి పెద్దకు ఊహించని పరిస్థితిలో ఉంటే ఆ కుటుంబం తలకిందులవుతుంది. ఆ పరిస్థితులు ఏర్పడ వద్దని కోరుకుంటున్నాం. అయితే అనుకోకుండా ఏమైనా జరిగితే ఆ కుటుంబాలు కఠిన పరిస్థితులు ఎదుర్కోకుండా ఉండడానికే ఈ ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 'విద్యుత్తు సిబ్బందిలో నమ్మకం, ఆత్మస్థైర్యం ఇవ్వడం కోసం ఈ పథకాన్ని తీసుకువచ్చాం. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం పైన నమ్మకం కలుగుతుంది. ఎస్‌బీఐ లో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, చదువుకు ఆర్థిక సహాయంలో లోన్స్ ఇచ్చి చేయూతను ఇవ్వనున్నారు. అనుకోని ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 80 లక్షల పరిహారం వస్తుంది. ఈ ఖాతా తెరిచిన ఉద్యోగులు అకౌంట్ లో జీరో బ్యాలెన్స్ ఉన్నా సేవలు వినియోగించుకోవచ్చు, చెక్ బుక్, ఏటీఎం కార్డు లాంటి సేవల పైన ఎటువంటి చార్జెస్ ఉండవు. సహజ మరణం పొందితే 10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుంది. ఉద్యోగితోపాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందని' భట్టి విక్రమార్క తెలిపారు. ఏ ఉత్పత్తి జరగాలన్నా విద్యుత్ అనివార్యం, రాష్ట్ర దేశ అభివృద్ధికి అత్యంత ఎక్కువగా ఉపయోగపడే శాఖ విద్యుత్ శాఖ. మనిషి బతకడానికి అవసరమయ్యే ఆక్సిజన్ కొద్దిసేపు ఆగితే ఎంత ప్రమాదమో విద్యుత్ సరఫరా కొద్దిసేపు ఆగినా ప్రమాదం అన్న పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. 2023 తో పోలిస్తే 2025లో డిమాండ్ 17,162 మెగావాట్లు వచ్చింది. 2000 మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగింది. 2025 న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీ తెచ్చాం. విద్యుత్ వాడుకోవడమే కాకుండా దేశవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ వనరుల సమీకరణకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## స్కూళ్లలో రేషనలైజేషన్ రచ్చ

**మెదక్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని, ఇది జూన్ 13వ తేదీ లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ ఏడాది ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ సమయంలో సర్దుబాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కోల్పోతామని చెబుతున్నారు. తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని, కనీసం జూన్ 30 వరకు వచ్చిన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేసుకోవచ్చు. వీటితో పాటు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలనే నిబంధనలున్నాయి. పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వొద్దు. ఈ ప్రక్రియలో గత యూడైస్ వివరాలను ప్రాతిపదికగా తీసుకోనున్నారు. 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒకరు, 60లోపు ఇద్దరు, 90లోపు ముగ్గురు, 120లోపు నలుగురు, 150వరకు ఐదుగురు, 200లోపు విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులుండాలని, 200 దాటిన తర్వాత ప్రతి 40మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రవేశాలు పెంచేందుకు కసరత్తు...

ఈ ఏడాది బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. తమ కృషితో ప్రవేశాలు చాలవరకు పెరుగుతాయని ఆశాభావంతో ఉన్నారు. పలు గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు బడులకు పంపబోమని తీర్మానాలు సైతం చేయించారు. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యా ర్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారు. ఇది ఆచరణలో అసాధ్యమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను ఇద్దరు ఎలా బోధిస్తారని, విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ఉపాధ్యాయవర్గాలు వాదిస్తున్నాయి. బోధనతో పాటు అనేక రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, వాటికే ఒకరు సరిపోతున్నారని చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో పదోన్నతులు, బదిలీలు, నూతన డీఎస్సీతో పాటు 2008 అభ్యర్థులను తాత్కాలిక ప్రాతి పదికన తీసుకోవడంతో సర్దుబాటు ఆవశ్యకత అంతగా లేకపోవచ్చనే వాదన ఉంది.

సర్దుబాటు ప్రక్రియ వాయిదా వేయాలి...

సుంకరి కృష్ణ, పీఆర్టీయూ మెదక్ జిల్లాఅధ్యక్షుడు

ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులు జూన్ నెలాఖరు వరకు వాయిదా వేయాలి. వేసవి సెలవుల్లో జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాం. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జూన్ 18 వరకు బడిబాటలో నూతన ప్రవేశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నాం. జూన్ చివరి వరకు ఎన్రోల్మెంట్ ఆధారంగా చేసుకుని సర్దుబాటు ప్రక్రియ చేపడితే ఫలితం ఉంటుంది.

సర్దుబాటు చేస్తాం...

ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఉపాధ్యాయ సంఘాల నుండి విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమం పూర్తవగానే విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు చేస్తాం. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఈనెలాఖరు వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు చేసే అవకాశం ఉంది.

## అంతర్జాతీయ సినీ సిటీగా హైదరాబాద్..

### డీపీఆర్ సిద్ధం చేయాలని కేబినెట్ సబ్‌కమిటీ ఆదేశం

**హైదరాబాద్:** హైదరాబాద్‌ను అంతర్జాతీయ సినీ సిటీగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. సినీరంగంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డి.శ్రీధర్ బాబుతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది.



జాతీయ, అంతర్జాతీయ సినీ పరిశ్రమలను ఆకర్షించేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని కేబినెట్ సబ్ కమిటీ పేర్కొంది. సినిమా షూటింగ్‌లకు పోలీసు, ఫైర్, మున్సిపాలిటీ తదితర శాఖల అనుమతులన్నీ సింగిల్ విండో పద్ధతిలో అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. అనుమతులు పొందేందుకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించాలని భట్టి విక్రమార్క సూచించారు. థియేటర్లలో తినుబండారాల ధరలను నియంత్రించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి, మంత్రులు స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు గతంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల్లో ప్రస్తుతం నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో తెలపాలని కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీపై ఏర్పాటు చేసిన కమిటీని తదుపరి సమావేశానికి పిలిపించాలని తెలిపారు. ఈనెల 14న గద్దర్ ఫిలిం అవార్డుల వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, కమిషనర్ హరీష్, డైరెక్టర్ కిశోర్ బాబు, హోం శాఖ ప్రత్యేక సీఎస్ రవి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలు గంజాయికి దూరంగా ఉండాలి
## జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్




**వాస్తవ నేస్తం భీంపూర్:** ఆదివాసీలు గంజాయి కి దూరంగా ఉండాలని,వాహనం నడిపే క్రమంలో ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు..మంగళవారం భీంపూర్ మండలంలోని మారుమూల గ్రామాలైన గుబిడి,టెకిడి రాంపూర్, కరంజీ, భగవాన్పూర్ లను సందర్శించి ప్రజలతో పోలీసు మీకోసం కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అడవిలో అత్యంత మారుమూల గ్రామం భగవాన్ పూర్ కు ద్విచక్ర వాహనం తో చేరుకొని యువతకు కల్పించిన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని గ్రామ పేరును కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో ఎలాంటి గంజాయిని సాగుచేయకూడదని, సేవించకూడదని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా గంజాయిని పండించిన వారిపై కేసులో నమోదు చేస్తూ ప్రభుత్వ పథకాలు రాకుండా జిల్లా యంత్రాంగానికి సిఫార్సు చేయబడుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని,ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొని ఉద్యోగాలు సాధించి వచ్చిన ప్రదేశంలో ఉద్యోగాల నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా యువత క్రీడారంగంలోనూ అభివృద్ధి చెందాలని నాలుగు గ్రామాలలో వాలీబాల్ కిట్లు క్రికెట్ కిట్లను అందజేసి క్రీడారంగం లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చిన్నపిల్లలకు చదువు ఒక ప్రాధాన్యతను తెలియజేసి ప్రతి ఒక్కరూ చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. చదువు వల్ల భవిష్యత్తు మారుతుందని, ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు సాధించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహారాష్ట్ర తో అనుసంధానంతో ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఎలాంటి సమాచారం అయినా తన వద్ద ఉండే ప్రత్యేకంగా నిర్వహించబడుతున్న 8712659973 అనే నెంబర్కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదిలాబాద్ జిల్లాలో షీ టీం బృందం మహిళలకు అండగా ఉందని, మహిళల వేధింపుల పట్ల కళాశాలలో పాఠశాలలో విద్యార్థినిలకు ఎలాంటి సమస్యలున్న షీ టీం బృందాలకు తెలియజేయాలన్నారు. షీ టీం నెంబర్ 8712659953 కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ డి సాయినాథ్, బీంపూర్ ఎస్సై పీర్ సింగ్ నాయక్, గ్రామ పెద్దలు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# బోనాల సందడి షురూ

**హైదరాబాద్ :** తెలుగింటి ఆడబడుచులు జరుపుకునే ఘనమైన పండగ బోనా లు పండగ. ఆషాడం మాసం వస్తుందంటే చాలు తెలంగాణ రాష్ట్రంలో బోనాల సందడి మొదలవుతుంది. వర్షాకాలం ప్రారంభంలో ఎటువంటి సీజనల్ వ్యాధులు రాకుండా.. ప్రజలు సుఖ శాంతులతో జీవించాలంటూ అమ్మవారిని వేడుకుంటూ బోనం సమర్పించే పండగ. గోల్కొండ కోటలో అమ్మవారికి బోనాలు సమర్పించడంతో మొదలయ్యే ఈ వేడుకలు ఆషాడం మాసంలోని ఆదివారం అంగరంరంగ వైభవంగా జరుపుకుంటారు. ఈ వేడుకల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు మొదలు పెట్టింది.మరికొన్ని రోజుల్లో ఆషాడ మాసం రానుంది. ఈ నేపధ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలూ బోనాల జాతరను జరుపుకునేందుకు రెడీ అవుతున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. అయితే మొదటి రోజే గురువారం రావడంతో జూన్ 26వ తేదీ నుంచే బోనాల సంబురాలు ప్రారంభం కానున్నాయి. ఆషాఢ మాస బోనాల ఏర్పాట్ల గురించి రివ్యూ మిటింగులో మంత్రి కొండా సురేఖ పలు సూచనలు చేశారు. జంట నగరాల్లోని మొత్తం 28 టెంపుల్స్ లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని చెప్పారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రావొద్దని.. బోనాల పండగను జరపడం కోసం ఎక్కడ లోటు లేకుండా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ 20 కోట్ల మంజూరు చేశామని చెప్పారు. ఒకవేళ బోనాల ఏర్పాట్లకు ఈ డబ్బులు సరిపోలేదు ఇంకా కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్నీ తీసుకెళ్దామని.. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎక్కడా రానివ్వకుండా ఏర్పాట్లు చేయాలనీ అధికారులకు సూచించారు. గత సంవత్సరం పొన్నం ప్రభాకర్ గారికే ఇబ్బంది వచ్చింది. ఈసారి అలాంటి సన్నివేశం మళ్ళీ రిపీట్ కావొద్దని అధికారులకి సూచిస్తున్నా అని అన్నారు మంత్రి కొండా సురేఖ.ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అమ్మవారి



ఆశీర్వాదం అందరి మీద ఉండాలని.. గతంలో ఏర్పాట్లు చేసే సమయంలో జరిగిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని.. మళ్ళీ జరగకుండా ఈ ఏడాది ముందస్తుగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసుకుని ముందుకు వెళ్ళాలని సూచించారు.జూన్ 26న ఆషాడం మాసం ప్రారంభం కానుంది. ఈ రోజు గురువారం కనుక తొలి బోనం గోల్కొండ లోని అమ్మవారికి సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభం అవుతాయి. తర్వాత వరసగా బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. ఈ సంబురాల్లో రంగం, తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుంది. కనుక దేవాలయాలకు ఇచ్చే చెక్స్ రెవెన్యూ అండ్ ఎండోమెంట్ కోఆర్డినేట్ చేసుకొని పండగ లకు ముందే పనులను పూర్తి చేయాలని.. ఈ బోనాల సందర్భంలో విధులను నిర్వహించే అధికారులు.. ఉద్యోగంలా భావించకుండా.. ఒక సేవ చేస్తున్నామని భావించాలని చెప్పారు. ఎందుకంటే సాంస్కృతిక కార్యక్రమాలు దైవ చింతనతో జరగాలని అన్నారు. అదే విధంగా బోనాల జాతరలో విధులను నిర్వహించే పోలీస్ సిబ్బంది.. లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఇబ్బందులు లేకుండా అన్ని రకాల డిపార్ట్మెంట్ లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మొత్తం మీద ఈ బోనాల జాతరలో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారని.. కనుక ఎటువంటి తలెత్తకుండా.. ఏర్పాట్లలో ఎక్కడ లోపం లేకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు మంత్రి కొండా సురేఖ.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం తయారు చేయాలి

**కరీంనగర్ :** ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వంట చేసే సిబ్బందికి సూచించారు.జిల్లాలోని అన్ని కేజీబీవీలు, బాలికల రెసిడెన్షియల్ హాస్టళ్లలో వంట చేసే 90 మంది సిబ్బందికి రామడుగు మండలం వెదిర గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై సిబ్బంది వంట చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. శిక్షణలో భాగంగా వంట సిబ్బంది తయారుచేసిన భోజనాన్ని రుచి చూశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంట సిబ్బంది వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటిస్తూ వంటగది పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వంట చేసేందుకు పరిశుభ్రమైన నీరు వాడాలని, నాణ్యతతో కూడిన భోజనం తయారు చేయాలని అన్నారు. డైట్ మెనూలో పేర్కొన్న విధంగా వివిధ రకాల పిండి వంటలు, పలహారం వంటివి రుచికరంగా చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రకారం



వంట చేయాలని సూచించారు. కేజీబీవీలలో స్థలం ఉన్నందున వంటకు ఉపయోగకరమైన కరివేపా వంటి మొక్కలు నాటాలని, స్వీట్ పొటాటో వంటి పాదులు వేయాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేశ్వరి, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లీ కళ్యాణ మహోత్సవం



**వాస్తవ నేస్తం,పోతంగల్ :** మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లీ కళ్యాణ మహోత్సవం, బోనాల పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆడపడుచులు తలపై బోనమెత్తి భాజా భజంత్రీలతో, మంగళ హారతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయం వద్దకి చేరుకొని అమ్మవారి కళ్యాణ మహోత్సవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు, ఆడపడుచులు యువకులు పాల్గొన్నారు.

## భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**వాస్తవనేస్తం,బజార్హత్నూర్:** మండలంలోని రాంపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు.. తహశీల్దార్ శ్యాంసుందర్, అర్ఐ రాథోడ్ నూర్ సింగ్ , డిప్యూటీ తహశీల్దార్ హిరలాలా అద్వర్యంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలు తీర్చడం కోసమే ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇట్టి అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, హరిచంద్ పాటిల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూ తగాదా కేసులో ఒకరికి జైలు శిక్ష

· · ·:భూ తగాదా విషయంలో అన్నను గాయపరిచిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, 10 వేలు రూపాయల జరిమాన విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి అరుణ్ కుమార్ జేఎఫ్సీఎం మెట్ పల్లి తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్య కు ఐదుగురు కుమారులు ఆత్మకూరు గ్రామ శివారులో మల్లయ్య కు ఒక ఎకరం భూమి ఉండగా ఈ యొక్క భూమిని 5 గురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని ఆ యొక్క నలుగురు కుమారులు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకొన సాగారు. 31 ఆగస్టు 2019 రోజున బీరయ్య తన ట్రాక్టర్ తో మిగతావారు చేసుకుంటున్న పంటను చెరపడానికి ప్రయత్నించగా దీనికి అడ్డుగా వెళ్లిన తన అన్న అయిన ముత్తయ్య ను పార తో కొట్టగా అతని కుడి భుజంపై గాయం కావడం జరిగింది. ఇట్టి విషయం గురించి అతని రెండవ తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు అయిన బీరయ్య పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ తమ వాదనలు వినిపించగా సాక్షులను విచారించిన న్యాయ మూర్తి అరుణ్ కుమార్,జేఎఫ్సీఎం మెట్ పల్లి నిందితుడు బీరయ్య (58) కి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేలు రూపాయల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.ఈ కేస్ లో పకడ్బందీగా విచారణ జరిపి సాక్ష్యాదారాలను, సాక్ష్యులను తగు రీతిలో కోర్టులో ప్రవేశ పెట్టి ,ఇట్టి శిక్ష పడటనికి కృషిచేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ అదేవిధంగా పోలీస్ శాఖ తరఫున ఇట్టి నేరపరిశోధన అధికారులు ఎస్.ఐ కిరణ్ కుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్స్ ఎస్.ఐ జి.శ్రీకాంత్,కిరణ్ కుమార్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ సునీల్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## నేడు మెట్‌పల్లిలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

### మెట్ పల్లి ఆపరేషన్ ఏడిఈ దురిశెట్టి మనోహర్

**మెట్ పల్లి :** మెట్ పల్లి లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక, రెండవ సిజిఆర్ఎఫ్ నిజామాబాద్ లోకల్ కోర్టును ఈ నెల 11న బుధవారం 33/11కేవీ ఉపకేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్నట్టు మెట్ పల్లి ఆపరేషన్ ఏడిఈ దురిశెట్టి మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఏడిఈ మనోహర్ మాట్లాడుతూ లోకల్ కోర్టులో మెట్ పల్లి ఆపరేషన్ సబ్ డివిజన్ పరిధి మెట్ పల్లి రూరల్, మెట్ పల్లి టౌన్ -1, మెట్ పల్లి టౌన్ -2 సెక్షన్ల కు చెందిన వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత పిర్యాదులు, సమస్యలు దాఖలు చేసుకొనే వీలు ఉందన్నారు. ఈ వేదికలో సిజిఆర్ఎఫ్-లోకల్ కోర్టు ఛైర్ పర్సన్ ఎరుకల నారాయణ, మెంబర్ టెక్నికల్ రామకృష్ణ, మెంబర్ అకౌంట్స్ కిషన్, నాల్గవ సభ్యుడు మరిపల్లి రాజగౌడ్ పాల్గొంటారన్నారు. లోకల్ కోర్టు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నాం 1 గంట వరకు వుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆపరేషన్ మెట్ పల్లి ఏడిఈ దురిశెట్టి మనోహర్ సూచించారు.

## అర్ధరాత్రి ఎస్సై వీరంగం

**వరంగల్ :** అర్ధరాత్రి చిమ్మ చీకట్లో కుటుంబంతోపాటు వెళ్తున్న బైకును ఓ పోలీస్ అధికారి ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే సదరు వ్యక్తి భయపడి బైక్ ఆపకుండానే వెళ్లిపోయాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన సదరు పోలీస్ ఆ కుటుంబానికి నరకం చూపించాడు. రాత్రంతా అడవిలోనే పిల్లలు భార్యతో బాధితుడిని ఉంచాడు. ఈ షాకింగ్ ఘటన వరంగల్ జిల్లాలో సోమవారం (జూన్ 9) వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే..వర్ధన్నపేటలోని రామవరం గ్రామానికి చెందిన బాలకృష్ణ భార్యా, ఇద్దరు పిల్లలు ద్విచక్ర వాహనంపై రాత్రి వెళ్తున్నాడు. అదే సమయంలో గ్రామశివారులో నిన్న రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పోలీసులు నిర్వహిస్తున్నారు. ఇంతలో ఎస్ఐ చందర్ దంపతుల వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే బాలకృష్ణ అపకుండా ముందుకు వెళ్లాడు. ఆపమన్న వెంటనే బైక్ ఆపలేదని శివమెత్తిన ఎస్ఐ చందర్ రాత్రంతా ఆ కుటుంబాన్ని అడవిపాలు చేశాడు. బార్య పిల్లల ముందే అతని చెంప చెళ్లుమనిపించిన ఎస్ఐ, ఆయన వాహనం పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని చిమ్మచీకట్లో నడిరోడ్డుపై వదిలేశాడు.దీంతో ఆ కుటుంబం రాత్రంతా బోరున విలపిస్తు దిక్కుతోచని స్థితిలో రోడ్డుపైనే కూర్చున్నారు. బండి ఆపలేదని తన భర్తను అకారణంగా కొట్టి, బండి తీసుకెళ్లిన ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని బాధితుడి బార్య, పిల్లలు డిమాండ్ చేస్తున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com